మున్సిపాలిటీలో 'ముసలం'

- కమిషనర్ వ్యవహార శైలిపై సిబ్బంది అసహనం
- సెలవుపై వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఉద్యోగులు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ వ్యవహార శైలిపై మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారన్న సమాచారం పట్టణంలో వినిపిస్తుంది. బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ ఇటీవల పలు వార్డులలో పర్యటించినప్పుడు పారిశుద్ధ్యం, తాగునీరు విషయంలో ఆయా విభాగాల సచివాలయ కార్యదర్శులకు, మేస్త్రీలకు మెమోలను జారీ చేశారన్న విషయం ఆయా ఉద్యోగులకు మింగుడు పడటం లేదు. వాస్తవానికి ఒక ఉద్యోగి పనితీరు బాగోలేని పరిస్థితుల్లో ఆ ఉద్యోగి యొక్క పై అధికారికి కమిషనర్ ఫిర్యాదు చేసి ఆ ఉద్యోగిపై చర్య తీసుకోవాలని సిఫార్సు చేయాలే తప్ప, కమిషనరే కింద స్థాయి ఉద్యోగులకు మెమోలను జారీ చేస్తే ఆ విభాగ అధికారుల యొక్క అధికారాన్ని కాలరాసినట్లే అవుతుందని ఆ విభాగాల సిబ్బంది ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీలో కీలకపాత్ర పోషిస్తున్న ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రణాళిక, పారిశుద్ధ్య విభాగాలకు సంబంధించిన సిబ్బంది పైన కూడా మున్సిపల్ కమిషనర్ ఒంటెద్దు పోకడగా వ్యవహరిస్తున్నారని వాస్తవానికి ప్రతిరోజు వార్డు పర్యటన చేసే సమయంలో ఆయా విభాగాలకు సంబంధించిన అధికారులను గాని, సిబ్బందితో గాని కమీషనర్ వార్డు పర్యటన చేయాలని, పట్టణ భౌగోళిక స్వరూపాలు తెలియకుండానే ప్రతిరోజు ఆయన ఒక్కరే వార్డు పర్యటన చేయడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదంటున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్లు విభాగాల అధికారులుతో గాని, సిబ్బందితో గాని కలిసి పనిచేసి పాలకవర్గ సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరించటం జరిగేదని ప్రస్తుతం ఆ పరిస్థితి మున్సిపాలిటీలో కనిపించడం లేదని వాపోతున్నారు. ఇక ప్రతి ఉద్యోగికి సెలవు అనేది వారి హక్కు అని అత్యవసర పరిస్థితుల్లోను, డిపార్మెంటల్ పరీక్షలు రాసేందుకు కూడా సెలవును మంజూరు చేసేందుకు కమిషనర్ నిరాకరించడం తగదన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అలాగే విభాగాలకు సంబంధించిన ప్రతి ఫైలుకు కొర్రి వేస్తూ సంతకాలు చేసేందుకు కూడా నిరాకరిస్తున్నారన్న వాదన పలువురి నోట వినిపిస్తుంది. మున్సిపాలిటీలో అనుభవం కలిగిన ఉద్యోగులపై ఈ విధంగా వ్యవహరించడం మింగుడు పడటం లేదని ఇలాగే వ్యవహారం కొనసాగితే సెలవుపై వెళ్లేందుకు ఉద్యోగులు సిద్ధమవుతున్నట్లు బోగట్టా.

విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు: కమిషనర్

ఉద్యోగులు వారి విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని అందరి సహకారంతో మున్సిపల్ అభివృద్ధికి సహకరించటం జరుగుతుందని కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. వార్డు పర్యటనలో అవసరమైన చోట సచివాలయ కార్యదర్శులతో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రతి ఉద్యోగి వారి బాధ్యతను ఎరిగి విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు సమాధానం చెప్పాల్సింది ఉద్యోగులే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం/ బెలగాం: ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని, శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంతో పాటు ప్రతి ఏడాదివలే ఈఏడాది కూడా రాష్ట్రస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ ఆకాంక్షించారు. 10వ తరగతి పరీక్షల నిర్వహణపై డీఈఓ, ఎంఈఓలు, హెచ్ఎంలతో ఆదివారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు ఇంకా 15రోజులు మాత్రమే గడువు ఉన్నందున, విద్యార్థులు బాగా చదువుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. రాత్రివేళల్లో విద్యార్థుల స్టడీ హవర్స్‌ను పరిశీలించాలని సూచించారు. పల్లె నిద్రలో కొందరు విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నట్లు గమనించడం జరిగిందని, అటువంటి విద్యార్థులందరూ ఆయా సబ్జెక్టులపై మంచి పట్టు సాధించేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మార్చి 17నుంచి 31వరకు పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.45 గం.ల వరకు జరుగుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా 10,455 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి పరీక్షా కేంద్రంలో పక్కా ఏర్పాట్లు చేసి పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని విద్యా శాఖ అధికారులకు తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఎస్ ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని జోగంపేట ప్రతిభ కళాశాలలో ఆదివారం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలలో 6వ తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్షను నిర్వహించారు. 227 మంది అభ్యర్థులకు 209మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ బి.ధర్మరాజు, డిపార్మెంటల్ ఆఫీసర్ గణపతినాయుడులు తెలిపారు. పరిశీలకులుగా కురుపాం ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ యోగేంద్ర బహదూర్, ఐటీడీఏ నుండి అబ్జర్వర్‌గా చంద్రబాబు హాజరయ్యారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - వీరఘట్టం: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఎస్ఐ కళాధర్ అన్నారు. మండలంలోని ఆటో డ్రైవర్లతో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్తగా వచ్చిన మోటార్ అండ్ వెహికల్స్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎస్సై సూచించారు. కొత్త నిబంధనల గురించి ఆటో డ్రైవర్లకు తెలిపారు. ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చాలని, నిబంధన అతిక్రమించిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన పుష్పశ్రీవాణి

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం ఎంపీటీసీ టివిఎస్ స్వామి యాజులు కుమారుడు సోమనాథ్ శుక్రవారం సాయంత్రం పాడేరు - అరకు మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. మరణ వార్త తెలుసుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆదివారం ఉదయం మంతిన వీదిలో స్వామి నివాసానికి వచ్చి పరామర్శించారు. ప్రమాదానికి గురైన కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్లప్పుడూ వైసీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, సర్పంచ్ సుజాత, నాయకులు నాగేశ్వరరావు, ఆదిల్ జిలానీ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి బకాయిపడ్డ ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలలో ఆస్తి వసూళ్లలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, కొళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నుల వసూళ్లలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది నిమగ్నమై ఉన్నారని పట్టణ ప్రజలు సకాలంలో మున్సిపాలిటీకి బకాయి పడ్డ పన్నులను, సమీప సచివాలయంలోగాని, కార్యాలయంలో గాని చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అనంతరం పట్టణంలో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బి.ఈశ్వరరావు, జి.వినయ్ కుమార్, సచివాలయ కార్యదర్శి పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర - కురుపాం: మండలంలోని బియ్యాలవలస పంచాయతీ మూలిగూడ జంక్షన్ (దురబిల్లి జంక్షన్)లో ఆదివారం బిగ్ టివి ఆధ్వర్యంలో ఎస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి షేక్ గౌస్, బియ్యాల వలస సర్పంచ్ పువ్వల అజారీ సంయుక్త సహకారంతో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ వైద్య శిబిరానికి దురబిల్లి, మంత్రజోల, రంగుపురం, కుశబాడీ, సేకుపాడు, గుజ్జుపాడు గ్రామాల నుంచి సుమారు 120 మందికి పైగా రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేసుకున్నారు. ముందుగా సర్పంచ్ పువ్వల అజారి రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు కురుపాం, రేగిడి, దుడ్డుకల్లు హాస్పటల్ వైద్యులు శంకరావు, స్వాతి, సుకృత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన బిగ్ టివి యాజమాన్యానికి ఎస్ సొసైటీ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బియ్యాల వలస మాజీ సర్పంచ్ పువ్వల పత్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ సూర్య పీఠంలో సప్త సూర్య నమస్కారములు



విశాలాంధ్ర - బెలగాం: సౌర దీక్షలో భానువార ప్రయుక్త హోమములు, సకల కార్య సిద్ధి రామాయణ మంత్ర హోమము, మన్యుసూక్త, ఆయుస్సూక్త, దుర్గాసూక్త, ఋగ్వేద సూర్య సూక్త, పారాయణ సహిత హవనములు, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, మిత్ర రవి సూర్య భాను ఖగ పూష హిరణ్యగర్భ మరీచి ఆదిత్య సవితృ అర్క భాస్కర దేవతలకు పూజలతో సప్త సూర్య నమస్కారములు తృచ సౌర సంపుటితో శాస్త్రోక్తంగా జరిగాయి. ఆదిత్య పంచాయతన సూర్యపీఠంలో వేంచేసియున్న అంబికా దేవి ప్రీతికరంగా లఘుచండీ మంత్ర హవనములు, సువాసినీ అర్చనలు, నవనాగ అర్చన సహిత నవగ్రహ హోమములు బ్రహ్మశ్రీ శ్రీ వేమకోటి నరహరి శాస్త్రి అధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, వి.తేజ శర్మ, డి.ఉమా శర్మ, ఆదిత్య శర్మ, హర్ష శర్మ, అవధాని శర్మ, తదితరులు వైదిక సహకారం అందించారు. కార్యక్రమం అనంతరం యజ్ఞ ప్రసాదంగా నారాయణ సేవ చేశారు.

ముస్లిం సోదరులకు రంజాన్ నెల శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పార్వతీపురం: ముస్లింలకు అత్యంత పవిత్ర ఖురాన్ గ్రంథం ఆవిర్భవించిన మాసం రంజాన్ నెలని, రంజాన్ నెలవంక దర్శించుకుని ముప్పై రోజులపాటు కఠిన నియమాలతో రంజాన్ ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలను తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. అల్లాహ్ బోధనలు ఖురాన్ ద్వారా అందించిన మహమ్మద్ ప్రవక్త మార్గంలో పయనిస్తున్న ముస్లిం సోదర, సోదరీమణులు ప్రతి ఒక్కరూ ఈరంజాన్ నెలలో ఉపవాస దీక్షలు పాటించే శక్తిని, ఆరోగ్యాన్ని కారుణ్యమూర్తి అల్లాహ్ ప్రసాదించాలని తెలిపారు.

1/70 చట్టంపై అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలి

ఈనెల 6, 7 తేదీలలో రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - పాడేరు: 1/70 చట్టంపై అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ 48 గంటల బంద్ సందర్భంగా సీఎం నారా చంద్రబాబునాయుడు 1/70 చట్టంపై గౌరవిస్తున్నాం, రద్దు చేసే ఆలోచన లేదు అని ఎక్స్ వేదికగా ప్రకటించడం హర్షిస్తున్నాం కానీ ఆదివాసి ప్రాంతం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో ఆదివాసి ప్రాంతం అడవులంతా అధాని, అంబానీకి కట్టబెట్టి ఆదివాసులకు నిర్వాసితులు చేసే కుట్రలో పాల్గొంటుందని 1/70 చట్టంపై అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని అఖిలపక్షం ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశం గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మాన పడాలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ, బూడిద చిట్టిబాబు, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలలో జీవో నెంబర్ 3 కనీసం ప్రస్తావన లేకపోవడం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తూ ఆదివాసి ప్రాంతంలో ఆదివాసులకు ఉద్యోగాలు ఉండేలా తమ ప్రభుత్వం వస్తే కట్టుబడి ఉంటామని అరకు సభలో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడిన పరిస్థితి ఉందన్నారు. 100% ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ చట్టం ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని, బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు 17 వేల కోట్లు కేటాయించాలని, గిరిజన సలహా మండలిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈనెల 6, 7 తేదీలలో నిరాహార దీక్షలు పాడేరు ఐటీడీఏ ముందు చేయటానికి అఖిలపక్ష రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ మల్లమ్మ ఆదివాసి సంఘం నేతలు కే.అరుణ, శ్రీలత, రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాజు, ఆదివాసి సేన భాను, సిహెచ్ రావు కాంగ్రెస్, చంటిబాబు, సిపిఐ మండల కార్యదర్శి లక్ష్మణరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సీత, చిన్నమ్మి, అశోక్ కుమార్, బుల్లెమ్మ,, శైలు, భీముడు డిఎల్ఓ జిల్లా ప్రధాన కార్యదర్శి, కృష్ణ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులను పట్టించుకోరా...?

సీపీఐ మండల కార్యదర్శి రాంబాబు



విశాలాంధ్ర - వి.ఆర్.పురం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను పట్టించు కోకుండా నిర్లక్ష్యం వహించడం తగదని సీపీఐ మండల కార్యదర్శి రాంబాబు అన్నారు. గ్రామాలలో ఆర్. అండ్. ఆర్. లిస్టులో చాలా పేర్లు రాలేదని వాటి గూర్చి పట్టించుకునే నాధుడే కరువ య్యారన్నారు. గ్రామాల్లో ఎంతో మంది పేర్లు రాక ఆందోళన చెందుతుంటే అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదని ఆరోపించారు. ఇళ్ల స్ట్రక్చర్‌లో ఎంతోమంది పేర్లు. తప్పులు పడ్డాయని, ఇళ్ల కట్టాడాలు నోటిఫికేషన్‌లో రాలేదని, గ్రామసభల్లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్య మన్నారు. ఎంతోమంది నిర్భాగ్యుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ ఆర్ అండ్ ఆర్ లిస్టులో పేర్లు లేని వారిని మళ్లీ నమోదు చేస్తారా మంగళం చెప్తారా? అన్న ఆందోళన నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అధికారమే లక్ష్యంగా ప్రజలను మభ్యపెట్టిన కూటమి

మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి: అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు అమలు సాధ్యం కానీ హామీలు గుప్పించి ప్రజలను మభ్య పెట్టాయని, బాబు షూరిటీ మోసం గ్యారెంటీ అనేది రాష్ట్రంలో మరోమారు నిరూపితమైందని పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఈ పాలకులు మీన మేషాలు లెక్కిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు వరుస్తామని ఎన్నికల సమయంలో ఊక దంపుడు ఉపన్యాసాలు చేసిన టీడీపీ నేతలు, ఆ పార్టీ శ్రేణులు ఒంటరిగా పోటీ చేసి వైసీపీపై గెలిచే సత్తా లేక మతోన్మాద బిజెపితో, జనసేన పార్టీలతో జత కట్టి అమలు సాధ్యం కానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా సామాజిక పెన్షన్ మినహా మిగిలిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు.

మహిళా సాధికారత దిశగా అడుగులు

సంయుక్త కలెక్టర్ డా. ఎంజే అభిషేక్ గౌడ

విశాలాంధ్ర - పాడేరు: మహిళా సాధికారిత దిశగా ప్రతి మహిళా అడుగులు వేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ డా. ఎంజే అభిషేక్ గౌడ సూచించారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురష్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా బేటీ బచావో, బేటీ పడావో పేరుతో చేపట్టిన ర్యాలీలో జేసి మాట్లాడుతూ మహిళలందరూ సాధికారత దిశగా అడుగులు వేయాలని ప్రతి మహిళా తన సొంత కాళ్ళపై నిలబడేందుకు కృషి చేయాలని సూచించారు. బాలికల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి గల హక్కులు, రక్షణ చట్టాల గూర్చి అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళా సాధికారతతోనే ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. మహిళలు గత 10, 15 ఏళ్ళతో పోలిస్తే మహిళలు అన్ని రంగాలాలో ఉన్నప్పటికీ మరింత సాధికారత సాధించే దిశగా ఎదగాలని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పి.ఝాన్సి రాణి, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్. రజని, డీఎంహెచ్ఓ డా. జమాల్ బాషా, డీఈఓ పి.బ్రహ్మాజీరావు, డిఆర్‌డిఏ పిడి వి. మురళి, ఎంఇఓ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏకలవ్య ప్రవేశ పరీక్షలు

విశాలాంధ్ర - చింతపల్లి: స్థానిక గురుకుల కళాశాలలో ఏకలవ్య ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఏకలవ్య పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశాలకు అధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్ష రాసేందుకు హాజరయ్యారు. స్థానిక ఏకలవ్య పాఠశాలలో 480 మంది విద్యార్థులకుగాను 460 మంది విద్యార్థులు, ఈఎంఆర్ కొయ్యూరు ఏకలవ్య పాఠశాలలో 261 మంది విద్యార్థులకు గాను 243 మంది, ఏపీ గురుకుల కళాశాలలో 301 మంది విద్యార్థులకు గాను 287 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు హాజరయ్యారు. పోలీసులు బందోబస్తు మధ్య ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.

బాలల హక్కుల పరిరక్షణ సమితి కన్వీనర్‌గా 'రీముల గంగాధర్'

విశాలాంధ్ర - కొయ్యూరు: బాలల పరిరక్షణ ఆరోగ్యం జీవన విధానం, హక్కుల పట్ల శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అల్లూరి జిల్లా బాలల పరిరక్షణ కమిటీ నూతన కన్వీనర్ రీముల గంగాధర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బాలల హక్కులు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో నూతన జిల్లాల కమిటీ కార్యవర్గాలను ఎంపిక చేశారని గంగాధర్ తెలిపారు. దీంతో అల్లూరి జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్‌గా తనను రాష్ట్ర కన్వీనర్ కాంగు శుభ (చిన్ని) ఆశీస్సులతో ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సూచనల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పర్యటనలు చేస్తూ బాలల హక్కులు, పరిరక్షణ, సమస్యలు, జీవన విధానం, ఆరోగ్యం పట్ల నిరంతరం కృషి చేస్తానని తెలియజేశారు.

చిరు ధాన్యాల మిల్లెట్ మేళాకు గిరిజనులు పయనం

విశాలాంధ్ర - జి.మాడుగుల: భారతీయ చిరుధాన్యాల పరిశోదన సంస్థ ఐఐఆర్ హైదారాబాద్లో నిర్వహిస్తున్న మిలెట్ కిసాన్ మేళాకు మండల మత్స్యదేవత ఎఫ్పీవో సంఘం

ఆధ్వర్యంలో 40 మంది గిరిజన రైతులు పయనమవుతున్నట్టు సీఈవో ఐసారం హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రత్యేక బస్సులో ప్రయాణమయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3, 4 తేదీ లలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ ఆడిటో రియంలో నిర్వహించే ఈ మేళాకు శాస్త్రీయ సాగు, జీవవైవిధ్య పరిరక్షణ పోషకాహార విలువలతో కూడిన చిరు ధాన్యాల ఉత్పత్తులు ప్రాసెసింగ్ వాటి మార్కెట్ అంశాలపై ప్రత్యేకంగా అవగాహన ఉంటుందని హనుమంతరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో గబ్బడ శఖర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని స్థానిక బాలికల పాఠశాల-1లో మండల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజా వికాస్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలలో బాలికల పాఠశాల-2, బాలుర పాఠశాల కొత్తవలస బాలికల పాఠశాల-1లకు చెందిన 120 మంది పదో తరగతి విద్యార్థులు హాజరై ఈ పోటీ పరీక్షలు రాసారని మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు బలరాం తెలిపారు. విద్యార్థుల నైపుణ్యతను పెంచేందుకే ఈ పోటీ పరీక్షలు నిర్వహించామని ఆయన అన్నారు. ఈ పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు.

ఢిల్లీలో వర్క్‌షాప్‌కు శాంతి కుమారి

విశాలాంధ్ర - పాడేరు: కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మహిళా సాధికారతపై రెండు దశల్లో నిర్వహించే వర్క్ షాప్ నకు బిజెపి అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు, మఠం సర్పంచ్ మఠం శాంత కుమారి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 4, 5 తేదీల్లో ఢిల్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించు వర్క్ షాప్ కార్యక్రమానికి హాజరవుతానని, ఈనెల 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ వర్క్ షాప్‌ను పంచాయతీరాజ్ శాఖ ఏర్పాటు చేసిందన్నారు. స్థానిక సంస్థలలో మహిళల నేతృత్వంలో పాలనను బలోపేతం చేయడం వారి పాలన సామర్థ్యాలను పెంపుపై ఈ సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళా సాధికారత, మహిళ ఆధ్వర్యంలో పాలనను మరింత బలోపేతం చేసే అంశాలపై నిర్వహించే సదస్సులో పాల్గొనే అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో స్థానిక సంస్థల్లో ఆదివాసి మహిళల ప్రాధాన్యం ఏ మాదిరిగా ఉండాలి? ఏ రకమైన ప్రోత్సాహం ఇస్తే స్థానిక సంస్థల్లో గిరిజన మహిళలు భాగస్వామ్యం పెరిగేందుకు అవకాశం ఉందన్న విషయాన్ని కచ్చితంగా ఆ సదస్సులో తాను పంచుకుంటానని తెలిపారు. రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతంలో మహిళల అభ్యున్నతి పాలనలో మహిళల భాగస్వామ్యం ఏ స్థాయిలో పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఆశిస్తుందో ఆ స్థాయిలో గిరిజన ప్రాంతంలో ఉన్న మహిళలు భాగస్వామ్యం ఉండేలా అవసరమైన చర్యలు గురించి కూడా తెలియజేస్తారని ఆమె పేర్కొన్నారు.

శివపార్వతుల వసంతోత్సవం

విశాలాంధ్ర - వి. ఆర్. పురం: మండల కేంద్రం రేఖపల్లి కోట మైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశి విశ్వనాథ స్వామి వారి వసంతోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగ మంగళ వాయిద్యాలు నడుమ తీసుకొని రాగా భక్తులు స్వామివారిని దర్శించుకుని వారి వారి మొక్కులను చెల్లించు కుని స్వామివారి ప్రసాదాలను స్వీకరించి స్వామివారి కృపకు పాత్రుల య్యారు.

నేడే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కౌంటింగ్

- మరికొద్ది గంటల వ్యవధిలో ఫలితాలు వెల్లడి

విశాలాంధ్ర - పార్వతీపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు గత నెల 27న ఆరు జిల్లాల పరిధిలో నువ్వా నేనా అన్న రీతిలో జరిగాయి. సోమవారం విశాఖపట్నం జిల్లా కేంద్రంలో గల ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మరో రెండు గంటల్లో ప్రారంభం కానుంది. ఇప్పటికే ఆరు జిల్లాలకు సంబంధించి బ్యాలెట్ పత్రాలు విశాఖపట్నం చేరుకున్నాయి. ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికల బరిలో 10 మంది పోటీలో ఉండగా, ప్రధాన పోటీ పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులునాయుడు, కోరెడ్ల విజయగౌరిల మధ్యనే నెలకొందని విశ్లేషకులు అన్ని వర్గాల వారు చర్చించుకుంటున్నారు. ఈ ఎన్నికలలో 22 వేల 493మంది ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులయిన (ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో పనిచేసే వారు) ఓటర్లకుగాను 6 జిల్లాల్లోని 123 పోలింగ్ కేంద్రాల్లో 20వేల 780 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 92.40శాతం ఓటింగు నమోదైంది. ఈ ఎన్నికలలో ప్రధాన పోటీలో ఉన్న అభ్యర్థులలో పాకలపాటి రఘువర్మ ఒక్కసారి, గాదె శ్రీనివాసులునాయుడు రెండుసార్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసిన అనుభవం ఉండగా, పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన విజయగౌరీ తన ఉద్యోగానికి రిజైన్ చేసి మొదటిసారి పోటీ చేశారు. ప్రధానపోటీ కూడా ఏపీటిఎఫ్ నుండి పోటీచేస్తున్న పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు నుండి పోటీచేసిన గాదె శ్రీనివాసులు నాయుడుకు, పిడిఎఫ్ తరుపున చేసిన విజయగౌరీల మధ్యనే నెలకొందన్నది అందరికీ తెలిసిందే. ఏపీటీఎఫ్ నుండి పోటీ చేస్తున్న రఘువర్మకు వివిధ ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు విద్యాసంస్థలు మద్దతుతోపాటు ప్రభుత్వమద్దతు ఉండటంవలన విజయావకాశాలు ఆయనకే ఉన్నట్లు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.



రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవము, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషి, నిరంతరం రాజకీయ నాయకుడు తరహాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కష్టపడి పని చేయడం, ప్రధాన సంఘం తరఫున పోటీ, గత మూడేళ్ళ నుండి నిరంతర ప్రచారం వివిధ సంఘాల మద్దతు వలన ఆయనే గెలుస్తారనే ధీమాతో పీఆర్‌టీయూ నేతలున్నారు. యూటీఎఫ్ మద్దతుతో పిడిఎఫ్ తరఫున పోటీచేయడం, రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయుల సమస్యల పోరాటంలో కీలకపాత్ర పోషించడం, మహిళగా తనకు ఒక అవకాశం ఇస్తారనే ధీమాతో పాటు గ్రామీణ ప్రాంతాల ఉపాధ్యాయుల చేయూత, రెండో ప్రాధాన్యత ఓటు కలిసివచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో విజయగౌరి గెలుపు సునాయసమని ఆమె వర్గీయులు చెబుతున్నారు. ఏదేమైనా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 2025 ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మరో రెండుగంటల్లో విశాఖపట్నంలో ప్రారంభం కానున్న సందర్భంగా అందరిలో ఉత్కంఠ నెలకొంది. శాసనసభ ఎన్నికల తరహాలో జరిగిన ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితాల కోసం కూడా అన్ని వర్గాల వారు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు రాజకీయ నాయకులు కూడా ఈ ఎన్నికల ఫలితాలపై వాకబు చేయడంలో నిమగ్నమయ్యారు.

చంద్రబాబు వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు

- మాజీ ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: చిత్తూరు జిల్లాలో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలపై ఆయన స్పందించి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలందరినీ సమానంగా చూడాల్సింది పోయి ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా మాట్లాడటం సహేతుకమన్నారు. రాష్ట్రంలో వైసీపీకి మద్దతుగా నిలిచిన 1.40 కోట్ల మంది ప్రజలకు ఎటువంటి పనులు చేయకూడదని బహిరంగంగా చెప్పడం చూస్తే ఆయనకు ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై ఏ మాత్రం గౌరవం లేదన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు.

నేటి నుంచి అక్రిడిటేషన్ జర్నలిస్టులకు బస్సు పాసులు రెన్యువల్

విశాలాంధ్ర - పార్వతీపురం: జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు మరో మూడునెలలు గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు మూడునెలలకు బస్సు పాసులను కూడా రెన్యువల్ చేస్తూ నేటి నుండి పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు పాసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, అక్రిడేషన్ కార్డు జిరాక్స్, పాత బస్ పాస్ తీసుకుని వెళ్లి రెన్యువల్ చేసుకోవాలని ఆయన కోరారు.

వాకాడను పరామర్శించిన అలజంగి

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని వైసీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీ మాజీ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఆనారోగ్యానికి గురై విశాఖ ఆసుపత్రిలో నాగేశ్వరరావు వైద్యం పొందారు. ఆయన ఆరోగ్యం కుదుటపడడంతో ఇటీవల స్వగ్రామం బూర్జకు వచ్చారన్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆదివారం నివాసానికి వెళ్లి కలుసుకుని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వాకాడ నాగేశ్వరరావును పరామర్శించిన వారిలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములు నాయుడు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు ఆర్వీ పార్థసారథి, స్థానిక సర్పంచ్ గుజ్జల దాసు, సీనియర్ నాయకులు పోల బలరాంనాయుడు తదితరులున్నారు.

పాఠశాలకు టేబుళ్లు వితరణ

విశాలాంధ్ర - సీతానగరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1999 విద్యా సంవత్సరానికి చెందిన పదవతరగతి పూర్వవిద్యార్థులు తరగతి గదుల్లో పాఠ్యాంశ బోధనకు వీలుగా 25 వేల రూపాయల ఖరీదు చేసే టేబుళ్ళను వితరణగా అందజేశారు. పూర్వ విద్యార్థి సూర రవికుమార్ పాఠశాల ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయురాలిని సంప్రదించి పాఠశాలలో ప్రధాన అవసరాన్ని తెలుసుకుని ఫర్నిచర్ సదుపాయం కల్పించారు. 1999 బ్యాచ్ విద్యార్థుల తరఫున మాటిచ్చిన సూర రవికుమార్, పూర్వవిద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పలగర శ్రీదేవి, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయులకు ఫర్నిచర్ సమస్య తీరడం వారెంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఫర్నిచర్ పేరుతో సెంటర్ నిలిపివేయడం సమంజసమేనా!

ఎంతో చరిత్ర ఉన్న సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షా కేంద్రంను ఈఏడాది ఫర్నిచర్ పేరట నిలిపివేయడం ఎంతవరకు సమంజ సమని పూర్వవిద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నో పాఠశాలలకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తున్న నేటితరుణంలో మండల కేంద్రంలోఉన్న అతిపెద్ద పాఠశాలకు ఫర్నిచర్ లేకపోవడం ఆశ్చర్యం అనిపిస్తుందన్నారు. పరీక్షలను పక్కనపెడితే విద్యార్థులు ఎలాకూర్చొని తరగతుల్లో పాఠాలు వింటున్నారన్నది కూడా అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వాలు కోట్లాది రూపాయలను పాఠశాలల్లో, కళాశాలలోమౌలిక వసతులు, మౌలిక సదుపాయాల కల్పనకోసం ఖర్చుచేస్తున్న ఇక్కడ ఉన్నత పాఠశాలలో ఫర్నిచర్ ఇంతవరకు లేకపోయినా అంశాన్ని జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లలేదాఅని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికైనా పరీక్షా కేంద్రం పక్కన పెడితే పాఠశాలల్లో ఆరవతరగతి నుండి పదవ తరగతివరకు విద్యార్థుల అవస్థలను గుర్తించి పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టిసారించి ఈ పాఠశాలలో ఫర్నిచర్ సమస్య తీర్చాలని వారంతా కోరుతున్నారు.

సింహాచలం అకాల మరణం విచారకరం

విశాలాంధ్ర - చింతపల్లి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గెమ్మెలి సింహాచలం అకాల మరణం విచారకరమని చౌడుపల్లి గెమ్మెలి లలిత అన్నారు. అల్లూరి జిల్లా పాడేరు నియోజకవర్గం చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీలోని భౌర్తి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఇటీవల పీసా కమిటీ ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గెమ్మెలి సింహాచలం గడచిన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె మాట్లాడుతూ సౌమ్యుడు, స్నేహశీలి అయిన సింహాచలం మరణం బాధాకరమన్నారు. మంచి వ్యక్తులను కోల్పోవడం విచారకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోనిభరాన్ని ప్రసాదించాలని ఈ సందర్భంగా కోరుకుంటు న్నానన్నారు. సింహాచలం భౌతికకాయాన్ని సర్పంచ్ లలిత భర్త, వైకాపా నాయకుడు సింహాచలం ఆ పంచాయతీలోని పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించి నివాళులు అర్పించారు. అదే క్రమంలో చింతపల్లి మండల కాంగ్రెస్ కమిటీ మృతుడు సింహాచలం పార్థివ దేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర

విశాలాంధ్ర - పార్వతీపురం: నియోజకవర్గంలో బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల్లో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాస్తున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయాలన్నారు. ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించి ఇటు కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరారు. ఫలితాల సాధనలో పార్వతీపురం నియోజకవర్గ ఇంటర్ విద్యార్థులు రాష్ట్రంలోనే ముందంజలో నిలవాలని ఆయన కోరారు.

సమిష్టి పోరాటంతో ఆదివాసి గౌడల సమస్యలు పరిష్కరించుకోవాలి

విశాలాంధ్ర - గంగవరం: ఆదివాసి గౌడుల సమస్యల పరిష్కారానికి ఆదివాసి గౌడులంతా సమిష్టిగా పోరాటం చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఆదివాసి గౌడ్ సంఘాల అధ్యక్షులు మట్టా రామ్మూర్తి గౌడు, కొవ్వుల నాగరాజు గౌడు పిలుపునిచ్చారు. ఆదివారం గంగవరంలో రెండు జిల్లాల ఆదివాసి గౌడ్ సంఘాల నాయకులు అత్యవసర సమావేశాన్ని నిర్వహించి. తమ కుల ధృవీకరణ పత్రాలు జారి విషయంలో జరుగుతున్న జాప్యలను పరిష్కరించేందుకు నిర్వహించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ప్రస్తుతం జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత విశాఖ, విజయనగరం, మన్యం ప్రాంతాల్లో గౌడలకు అందిస్తున్న కులధృవీకరణ పత్రాలను తమకు ఇవ్వడంలో ఇక్కడ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారన్నారు. రాజ్యాంగం తమకు కల్పించిన హక్కులను తాము పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే ఉన్న జీవోలను అమలు చేసి తమకు గౌడు ఎస్టీ సర్టిఫికెట్లను మంజూరు చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఆదివాసి గౌడ సంఘం నాయకులు పంబి అప్పలస్వామి గౌడు, కుప్పల దుర్గారావు, మట్ట రాజు, గూడవల్లి ప్రభాకర్, నందూరి సూర్య భాస్కర్, కొవ్వుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండల సీఐ సన్యాసినాయుడు, ఎస్సై నరసింహమూర్తి స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులను సమావేశ పరచి మారిన ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించే విధంగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అల్లూరి కూడలి వద్ద మానవహారాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మారిన ట్రాఫిక్ రూల్స్ మార్చి ఒకటవ తేదీ నుండి అమలవుతాయని, వాహనదారులు తప్పక హెల్మెట్, సీట్ బెల్ట్ లను ధరించాలని, వాహన చట్టాలను ఉల్లంఘించిన వారు ఫైన్ కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్సై నరసింహమూర్తి మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించకపోయిన, సిగ్నల్ జంప్, రాంగ్ రూట్‌లో వెళ్ళిన వారికి వెయ్యి రూపాయలు ఫైన్, మద్యం సేవించి నడిపితే 10 వేలు జరిమానా, లైసెన్సు రద్దు చేయబడునని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే 5వేలు జరిమానా, వాహనం సీజ్ చేయబడుతుందని తెలిపారు. వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోయినా, సెల్‌ఫోనులో మాట్లాడుతూ వాహనాన్ని నడిపినా, బైక్‌లపై ముగ్గురు ఎక్కినా, ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించకపోయినా అపరాధ రుసుమును వేసి చట్ట పరమైన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు.

ప్రశాంతంగా ఏకలవ్య ఎంట్రన్స్ పరీక్ష

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు 264 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. 282మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 18 మంది విద్యార్థులు హాజరు కాలేదని తెలిపారు. ఎంఇఓలు సత్యనారాయణ దొర, సూరయ్య రెడ్డిలు పర్యవేక్షణ అధికారులుగా వ్యవహరించారని తెలిపారు.

స్టార్ హెల్త్ ఆధ్వర్యంలో హోమ్ హెల్త్ కేర్ సేవలు

విశాలాంధ్ర - పాడేరు: భారతదేశపు రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ దిగ్గజం స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్) తమ హెూమ్ హెల్త్ కేర్ (హెచ్‌హెచ్‌సీ) కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 100 ప్రాంతాలకు విస్తరించడం ద్వారా దేశంలోనే అతి పెద్ద హెచ్‌హెచ్‌సీ ప్రొవైడరుగా నిల్చిందని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో ఆనంద్ రాయ్ తెలిపారు. 2023 జులైలో ప్రారంభించిన ఈ ప్రోగ్రాం, ప్రస్తుతం స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కస్టమర్లలో 85 శాతం మందికి ఎలాంటి అదనపు భారం పడకుండా మూడు గంటల్లోపే, ఇంటి ముంగిట్లోనే క్యాష్‌లెస్ వైద్య సంరక్షణ సేవలు అందిస్తోందన్నారు. భారత్‌లో ఆరోగ్య సంరక్షణ సేవలను మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు, లభ్యత, అఫోర్డబిలిటీని పెంచేందుకు ఇది తోడ్పడుతోందన్నారు.

నేటి నుంచి ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మంజులవీణ

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నేటినుండి 34 పరీక్షాకేంద్రాలలో జరుగుతాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి మంజులవీణ తెలిపారు. నేడు ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సంబంధించి జిల్లాలో 8881 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరిలో సాధారణ కోర్సులకు సంబంధించి 5836 మంది విద్యార్థినీ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 3045 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా ఎగ్జామినేషన్ కమిటీతోపాటు రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణ చేస్తాయన్నారు. ఈపరీక్షా కేంద్రాల్లో 461 సీసీ కెమెరాలు అమర్చడం జరిగిందని, పరీక్షలను జిల్లా ఎగ్జామినేషన్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర ఎగ్జామినేషన్ కంట్రోల్ రూమ్ లు పర్యవేక్షణ చేస్తుందన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలున్నాయన్నారు. ఈనెల 20వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షలు జంబ్లింగ్ తరహాలో జరుగుతాయని, ఎక్కడ మాస్ కాపీఇంగ్ జరక్కుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష హాల్లోకి సెల్ఫోన్లు అనుమతించడం జరగదన్నారు. 34 పరీక్ష కేంద్రాలకు సంబంధించి 34 సెల్ ఫోన్లను సిఎస్ లకు అందజేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు చేరుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతించడం జరగదన్నారు.సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రారంభం అవుతుందన్నారు.



వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

బైకుపై వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్న దృష్ట్యా ద్విచక్ర వాహనదారుల రక్షణ నిమిత్తం పోలీసు శాఖ చర్యలకు శ్రీకారం చుట్టింది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ హైకోర్టు ఆదేశాలతో కేంద్రం తీసుకొచ్చిన కొత్త మోటార్ వాహనాల చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. విడతల వారీగా జిల్లాలు, మండలాలు, గ్రామస్థాయిల్లో అమలు చేయాలని ఆలోచిస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనం నడిపేవాడితోపాటు వెనుక కూర్చునే వ్యక్తికి కూడా హెల్మెట్ తప్పనిసరి చేస్తున్నారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1000, వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోతే రూ.1000, బీమా లేకుండా వాహనం నడిపితే మొదటిసారి రూ 2000, రెండవసారి రూ.4000, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే రూ.5000, హెవీ లైసెన్స్ ఉండాల్సిన వాహనాలకు రూ.10,000, కాలుష్య ధ్రువీకరణపత్రం లేకపోతే రూ.1500, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే మొదటిసారి రూ.1500, రెండవసారి రూ.10,000, యూనిఫాం లేకుండా ఆటో నడిపితే మొదటిసారి రూ.150, రెండవసారి రూ.300, సీటు బెల్టు ధరించకపోతే డ్రైవర్‌కు రూ.1000, కూర్చున్న వారికి రూ.1000, ఫిట్నెస్, రిజిస్ట్రేషన్, రెన్యువల్ సర్టిఫికెట్ లేకపోతే మొదటిసారి రూ.2000, రెండవసారి రూ.5000, అతివేగంగా వాహనం నడిపితే రూ.1000, ట్రిపుల్ రైడింగ్ రూ.1000, రేసింగ్‌లు చేస్తే మొదటిసారి రూ.5000, రెండవసారి రూ.10వేల రూపాయల అపరాధ రుసుం వసూలు చేయడానికి చర్యలు సిద్ధం చేస్తున్నారు. పోలీస్ శాఖ రోడ్డు రవాణా శాఖ సంయుక్తంగా దాడులు చేపట్టి కేసులు నమోదు చేసేందుకు శ్రీకారం చుట్టనున్నారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను పొంది ఉండడంతో పాటు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రమాదాల నుండి రక్షించడానికి పోలీస్ శాఖ రవాణ శాఖ అధికారులు చేపట్టనున్న ఈ కార్యక్రమంను ప్రజలు అర్థం చేసుకొని సహకరించాలని కోరుతున్నారు.

200ల నిరుపేద జంటలకు సామూహిక వివాహాలు



విశాలాంధ్ర - రాజవొమ్మంగి: అల్లూరి జిల్లాలో కొత్తగా పెళ్లి చేసుకోబోయే నిరుపేద కుటుంబాలకు చెందిన 200 జంటలకు వివాహాలు జరిపిస్తున్నట్లు రాజవొమ్మంగి మండల బిజెపి అధ్యక్షుడు తాము సూరిబాబు తెలిపారు. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చినజీయర్ స్వామివారి ఆశీస్సులతో మంగళ వాయిద్యాలతో వేద మంత్రాల నడుమ ఈ పెళ్లిళ్ల జరుగుతాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో జరుపబడునని అల్లూరి జిల్లా ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ చివర వారంలో గానీ మే మొదటి వారంలో గానీ ఈ వివాహాలు జరుగుతాయని, వివాహాలు చేసుకునే వారు వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సామూహిక వివాహలలో పాల్గొనే వధూవరులకు నూతన వస్త్రాలు మధుపరకాలు, కాలికి మట్టెలు, మంగళసూత్రం అందించబడునని, అనంతరం విందు భోజనాలు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9492673017, 9490290520 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

గిరిజనులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు లోవరాజు

విశాలాంధ్ర - బెలగాం : పెద్దల సభకు గిరిజనులకు అవకాశం కల్పించాలని ట్రైబల్ రైట్స్ (టిఆర్ఎఫ్) ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు కోరారు. రాష్ట్రంలో సుమారుగా 10 లక్షల జనాభా ఉన్నటువంటి ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు రిజర్వేషన్ ప్రకారం ఎంపిగా, ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం ఉంటుంది కానీ మైదాన ప్రాంతంలో సుమారుగా ఇరవై లక్షలు జనాభా ఉన్నటువంటి గిరిజనుల కోసం వాళ్ళ తరఫున శాసనసభలో గాని శాసనమండలిలో గాని వాళ్ళ సమస్యలపై ప్రస్తావన చేయడానికి అవకాశం లేకుండా పోతుందని దాని వలన వాళ్ళు పడుతున్న బాధలు వాళ్ళ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండా ఉండే పరిస్థితి నేటికీ కూడా ఉందన్నారు. మైదాన ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులకు అటు కలెక్టరేట్ గాని ఇటు ఐటిడిఎ గాని ఎటూ తెలియకపోవడం చాలా బాధాకరమని అందుకని మైదానం ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే వాళ్లకు ఉన్నటువంటి సమస్యలు కూడా చట్టసభల్లో ప్రస్తావన చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పెద్ద మనసుతో ఆలోచించి మైదాన ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తారని కోరుతున్నామన్నారు.

శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - చింతపల్లి: యాదవ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహం సహా ఆలయంలో గల గోవు, వినాయకుని విగ్రహాలను శాస్త్రోక్తంగా హెూమం నిర్వహించి భీమసింగి గ్రామ సమీప గంగలో నిమజ్జనం చేశారు. అదే ఆలయ స్థానంలోనే నూతనంగా శ్రీకృష్ణుని ఆలయాన్ని నిర్మించేందుకు యాదవ కులస్తులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నర్సీపట్నం కి చెందిన ఆలయ అర్చకుల పర్యవేక్షణలో నూతన ఆలయ నిర్మాణానికి వాస్తు ప్రకారం ప్రత్యేక పూజలు, హెూమం నిర్వహించి ఆలయ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద పెదిరెడ్ల బేతాళుడు, సత్యవేణి దంపతులు, యాదవ కులస్తులైన గోకాడ సత్యనారాయణ, సందక కృష్ణమూర్తి, అల్లు శివాజీ, దాకారపు సత్తిబాబు లు దంపతులతో సహా భూమి పూజ, హెూమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పసుపులేటి వినాయకరావు, సందక తాతాలు, నమ్మి ఈశ్వరరావు. ఆలయ కమిటీ సభ్యులు,, అధిక సంఖ్యలో శ్రీకృష్ణుని భక్తులు పాల్గొన్నారు.